క్లుప్తంగా

విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలి



జడ్చర్ల టౌన్: విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన టీచర్స్ పేరెంట్స్ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల పురోగతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులది కీలకపాత్ర అన్నారు. విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై మంచిగా చదువుకోవాలని మంచిపేరు తీసుకురావాలని కోరారు. తమ పిల్లలు కళాశాలకు వెళ్తున్నారా లేదా అని తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

సమయపాలన పాటించాలి



మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో మెనూ తప్పక పాటించాలని, నాణ్యత లోపించకుండా చూడాలని సూచించారు. పరీక్షలు దగ్గర్లో ఉన్నందున తరగతుల, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థులను పరిశీలించి అనుమానాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పనులు నాణ్యతగా చేయాలి



మహమ్మదాబాద్: ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను నాణ్యతగా చేయాలని పంచాయతీరాజ్(పీఆర్) డిప్యూటీ ఈఈ సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ముందలితండా నుంచి లింగాయపల్లి రోడ్డు, వెన్కితండా రోడ్డు, మొకర్లాబాద్, సంగాయపల్లి, గాధిర్యాల్ సబ్‌సెంటర్, గండేడ్ మండలంలోని అంచన్‌పల్లిలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు, భవన నిర్మాణాలు అధికారులు సూచించిన మెటీరియల్ వినియోగించాలన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తే ఎక్కువకాలం మన్నిక ఉంటాయని పేర్కొన్నారు. పీఆర్ ఏఈ ముతీమ్ ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఓబ్లాయిపల్లి తండాలో కాంగ్రెస్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఇస్తావత్ రఘును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థుల గెలుప కోసం కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై దృష్టిసారించాలి

నవాబుపేట: గ్రామాల్లో ప్రభుత్వ పథకాల విషయంలో అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం నవాబుపేటలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చెందిన ఎల్1 లిస్ట్ పరిశీలన వేగంగా పూర్తిచేయాలన్నారు. ఏపీఓ జ్యోతి, భద్రునాయక్, సమీయుల్లా, కిరణ్ ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవాబుపేట: మహిళ ఇంట్లో ఉండగా ఇంటిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. మండలంలోని కొల్లూర్‌కి చెందిన దొమ్మరి యాదయ్య అనే వ్యక్తి సోమవారం అదే గ్రామానికి చెందిన గృహిణి పద్మమ్మ ఇంట్లో ఉండగా యాదయ్య కిచెన్ గదికి చెందిన కిటికీ అద్దాలు పగలగొట్టాడు. బూతులు తిడుతూ బీభత్సం సృష్టించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలకు తాపీ మేస్త్రీలో శిక్షణ

- కలెక్టర్ విజయేందిర బోయి



మహిళా మేస్త్రీకి సేఫ్టీ కిట్లను అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇందిరమ్మ గృహ నిర్మాణంపై ఎస్‌హెచ్‌జీ మహిళలకు తాపీమేస్త్రీలో శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులకు తాపీమేస్త్రీలో శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా వినూత్నంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి డీఆర్‌డీఓ ద్వారా గుర్తించిన మహిళా స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 41 మంది మహిళలకు తాపీమేస్త్రీలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా (నాక్) హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణలో నాక్ ద్వారా రూ.5 లక్షల బడ్జెట్‌లో నాణ్యత గా ఎలా నిర్మించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ అందిస్తారని తెలిపారు. గృహనిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 3500 ఇళ్లు, మండలంలో సుమారు 700 ఇళ్లు కట్టాల్సి ఉంటుందని, మేస్త్రీలు అవసరమని, అందుకే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ నిధుల నుంచి సీసీకుంట దమగ్నాపూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యురాలు రాణికి ఇటుక మిసన్ కోసం లక్ష రుపాయాలు అందజేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, సుమతి, ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్పందన లేని ప్రజావాణి



దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ప్రజల సమస్యపై ఫిర్యాదులు చేయడానికి ప్రత్యేకంగా ప్రతి సోమవారం ప్రజావాణిని నిర్వహిస్తున్నారు. అధికారుల కోసం ప్రజలు ఎదురు చూడాల్సింది పోయి అధికారులే ప్రజల కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తుల కోసం అధికారులు వేచి చూశారు. ఫిర్యాదులు రాకపోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఎంఈఓ బలరాం, ఏఈ కీర్తి ఇంకా పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీ ఉచిత కోచింగ్

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీలో ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాండురంగం, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాల నుంచి అనేక ర్యాంకులతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీ కోచింగ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు సెల్ నంబర్: 9154463393కు సంప్రదించాలని కోరారు. సమావేశంలో మల్లికార్జున్, రవికుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (టీయూసీఐ అనుబంధం) ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట అడ్డాలో ప్రచారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి కె.చంద్రకుమార్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మేష్, ప్రధాన కార్యదర్శి కె.సూర్యం తదితరులు హాజరవుతారన్నారు. నాయకులు బాలకృష్ణ, కృష్ణయ్య, తిరుపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

కోయిల్‌కొండ: యాదవులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని అఖిలయాదవ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, బీసీ జనచైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కోత్లాబాద్ గ్రామంలో యాదవుల కులదైవమైన మల్లన్నస్వామి పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాదవజాతిని అన్ని రాజకీయ పార్టీలు ఓటుబ్యాంకుగా మాత్రమే వాడుకున్నాయన్నారు. నాయకులు మహేష్‌యాదవ్, గోపాల్‌యాదవ్, భీమన్న, చిన్నప్ప, ఆంజనేయులు, బాబుయాదవ్ పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీకేరెడ్డి కాలనీలోని 'నవరత్నాలు' కేంద్రంలో రెండో బ్యాచ్ కింద బ్యూటీషియన్, కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో 240 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. వీరికి సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా కోర్సులకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మురళీ మోహన్, శ్రీరామ ఇంజినీరింగ్ కంపెనీ యజమాని బెక్కరి రాంరెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌చార్జ్ నిజలింగప్ప పాల్గొన్నారు.

ఏఐ బోధన విద్యార్థులకు వరం

- వీటిని సద్వినియోగం చేసుకోవాలి
- డీఈఓ ప్రవీణ్‌కుమార్
- నిజాలాపూర్, వేములలో ఏఐ ల్యాబ్ ప్రారంభం



నిజాలాపూర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

అడ్డాకుల: ఏఐ బోధన వెనుకబడ్డ విద్యార్థులకు వరంలాంటిదని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మూసాపేట మండలం నిజాలాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం తెలుగు, ఇంగ్లిష్, గణితంను కంప్యూటర్ ద్వారా విద్యార్థులకు నేర్పించారు. కంప్యూటర్ ఆధారిత బోధన గురించి విద్యార్థులు, ఉపాధ్యాయలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ ద్వారా వినూత్నంగా చేపట్టిన ఈ బోధన కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఏఐ ల్యాబ్‌ను ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు బాలకృష్ణయ్య, సరిత, రవీందర్, ఏఏపీసీ చైర్మన్లు రాజేశ్వరమ్మ, లావణ్య, ఉపాధ్యాయులు ఆంజనేయులు, మయూరి, ఆర్‌పీ రాఘవేందర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కౌన్సిలర్ ఇంటి ఎదుట ధర్నా



కౌన్సిలర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజలు

జడ్చర్ల టౌన్: ఐదో వార్డు లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ స్థానికులు డిమాండ్ చేశారు. నాగసాలలో కౌన్సిలర్ నవనీత ఇంటి ముందు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ బాగాలేదని, ప్రస్తుత రోడ్డు గుంతలమయం కావటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకుడు జగన్ ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావటం లేదని, వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సుందరమ్మ, సాయిలు, నర్సింహులు, శ్యాంసుందర్, నాగయ్య, గణేష్, శంకరయ్య, బాలమ్మ, సరస్వతి, కళ్యాణి, బంగారు శాంతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం వార్డు కౌన్సిలర్ నవనీతకు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు.

దేవాలయానికి విరాళం

దేవరకద్ర: స్థానిక ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానానికి ఓ భక్తుడు రూ.1.27లక్షల విరాళాన్ని అందజేశారు. దివంగత ఉస్కిల్ల అనంతమ్మ, ఉస్కిల్ల లొడ్డ వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు మాజీ ఎంపీటీసీ ఉస్కిల్ల వెంకట్రాములు, పద్మ దంపతులు ఈ విరాళాన్ని దేవస్థాన కమిటీకి సోమవారం అందజేశారు. దేవరకద్రకు చెందిన గట్టమ్మ, వీరన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా పాదపూజ

దామరగిద్ద: మండల కేంద్రంలో గురువు జగలింగేశ్వర తాతకు పాదపూజ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన జగలింగేశ్వరుడిని ప్రత్యేక రథంపై మహిళల మంగళ హారతులతో స్థానిక ఆంజనేయస్వామి స్థానిక ఊరడమ్మ మాత ఆలయం వరకు ఊరేగించారు. వివేకానంద విగ్రహ కూడలిలో భక్తులు వెండి కిరీటం, శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాదపూజ నిర్వహించారు.

వరి పంటను పరిశీలించిన అధికారులు



అడవి అజిలాపూర్‌లో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర: మండలంలోని అడవి అజిలాపూర్‌లో ఎండిన వరి పంటను సోమవారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, ఆర్ఐ శరత్ గ్రామం సమీపంలో వరి పంట వేసిన రైతు కృష్ణారెడ్డి పొలాన్ని సందర్శించారు. సాగునీటి వనరులు లేకపోవడంతో వేసిన రెండకరాల వరి పంట ఎండినట్లు రైతు తెలిపారు. ఈమేరకు పంట నష్టంపై అంచనావేసి వివరాలను సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదికను పంపించి న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

రైతులతో మాట్లాడి..

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్‌లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేష్, ఏడీఏ యశ్వంత్‌రావు పరిశీలించారు. వడగండ్ల దెబ్బకు వరి పొలంలో రాలిపోయిన గింజలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలను అంచనా వేసి వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడారు. 33శాతం కంటే ఎక్కువగా పంట నష్టం వాటిల్లిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వ్యవసాయాధికారి రైతులకు తెలిపారు. ఉదయం తహసీల్దార్ రాజునాయక్ చక్రాపూర్‌లో పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఏఈఓ సురేష్, రైతులు లక్ష్మారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గంగన్న, బాలరాజు, అంజనేయులు, శ్రీనివాసులు, లింగానాయక్ ఉన్నారు.

ఈదురు గాలులు.. వడగండ్ల వర్షం



మద్దూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద విరిగి పడిన చెట్టు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు తీవ్ర పంటనష్టం వాటిలినట్లు రైతులు పేర్కొన్నారు. నందిపాడ్, జాదరావ్‌పల్లి, మద్దూరు, నిడ్జింత, తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం కురువడంతో వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. మూడు గ్రామాల పరిధిలో దాదాపు 1800 ఎకరాల్లో వరిపంట దెబ్బతినట్లు రైతులు పేర్కొన్నారు.

కోస్గి: మండల పరిధిలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో వడగళ్ల వర్షం కురిసింది. చెన్నారం, బిజ్జారం, మీర్జాపూర్, హన్మాన్‌పల్లి, కడంపల్లితోపాటు పలు గ్రామాల్లో వడగళ్ల వాన జోరుగా కురిసింది. ఈదురు గాలులకు మామిడి పిందెలు నేలరాలినట్లు రైతులు వాపోయారు.

రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



పొన్నకల్‌లో ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గంలోని మూసాపేట, భూత్పూర్ మండలాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వాన వల్ల చేతికొచ్చిన పంటకు నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రిని కోరారు. మూసాపేట మండలంలోని వేముల, జానంపేట, చక్రాపూర్, దాసరిపల్లి, తుంకినిపూర్‌లో మొత్తం 422 ఎకరాల వరి పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. భూత్పూర్ మండలం కర్వెన, మదిగట్ల, వెలిక్కచర్ల గ్రామాల్లో వడగండ్ల వాన కురిసి వరి పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగినట్లు మంత్రికి వివరించారు. వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి పండించిన వరి పంట చేతికి వచ్చే సమయంలో ఇలా నష్ట పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని తక్షణమే వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

అడ్డాకుల: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొన్నకల్ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించి బాధితులను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సత్యం యాదవ్, సాయిలు యాదవ్ కుటుంబాలను పరామర్శించి సంతాపం వ్యక్తంచేశారు. వారికి ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శంకర్ యాదవ్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్వర్, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

క్షయ కట్టడికి ప్రత్యేక ప్రణాళిక

- సరైన జాగ్రత్తలు, చికిత్స తీసుకోవాలి
- డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ
- అధికారుల ప్రతిజ్ఞ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ

పాలమూరు: జిల్లాలో క్షయ వ్యాధిని కట్టడి చేయడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రి దగ్గర ఏర్పాటుచేసిన ర్యాలీని డీఎంహెచ్‌ఓతో పాటు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ క్షయ వ్యాధికి మందులు ఉన్నాయని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని సరైన జాగ్రత్తలు, చికిత్స తీసుకుంటే సరిపోతుందదని అన్నారు. ఎప్పటికప్పుడూ కొత్త కేసులు గుర్తిస్తూ మందులు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రత్యేక క్యాంపులు, ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజలలో అవగాహన కల్గిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్షయపై ఏర్పాటుచేసిన ప్రతిజ్ఞను డీఎంహెచ్‌ఓ ఇతర అధికారులతో చేయించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ మల్లిఖార్జున్, డాక్టర్ శశికాంత్, డాక్టర్ రఫీక్; జరీనా తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి



మహబూబ్‌నగర్ రూరల్: వడగండ్ల వానకు మండలంలోని వివిధ గ్రామాలలో సుమారు 1520 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని టీఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా విజయ్‌కుమార్ తెలిపారు. వరి పంటనే కాకుండా మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని, వడగండ్ల బాధిత రైతులకు ఎకరానికి రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకున్న ప్రాథమిక సమాచారం ప్రకారం చౌదర్‌పలిలలో 150 ఎకరాలు, బొక్కలోనిపల్లిలో 300 ఎకరాలు, రామచంద్రాపూర్‌లో 850 ఎకరాలు, జమిస్తాపూర్‌లో 120 ఎకరాలు, జనుంపల్లిలో 100 ఎకరాలు, మొత్తం 1520 ఎకరాలలో పంట పొలాలు నష్టపోయాయని తెలిపారు. నాయకులు ఎస్.బాలకృష్ణ, గట్టన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆదుకోవాలి

హన్వాడ: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలపై సోమవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన వరి పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రధానరహదారిపై డప్పులతో దండోర వేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సమస్యలపై తహసీల్దార్ కిష్ట్యానాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు బాలకిష్టయ్య, జంబులయ్య, రాములు, రమణయ్య, వెంకటమ్మ, టంకర రాములు, శ్రీకాంత్, బాలయ్య, పాల్గొన్నారు.

నేడు జల్సా షబే ఖదర్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఇబ్రహీం మసీదులో మంగళవారం రాత్రి జల్సా షబే ఖదర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అంజుమనే బజ్మే ఖాద్రియ కాజ్మియా జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాష ఖాద్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరావీ నమాజ్ అనంతరం షబే ఖదర్ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. మహ్మద్ తాజుద్దీన్ అధ్యక్షతన జరిగే ఈ వేడుకల్లో కొత్తకోటకు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త మౌలానా ఆబిద్ హుస్సేన్ ఖాద్రీ పాల్గొని ధార్మిక సందేశం ఇస్తారని తెలిపారు. ఈ షబే ఖదర్ వేడుకల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు నర్సింహులు సోమవారం పూజలు చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సహకారంతో గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కురుమూర్తి స్వామి ఆలయ కమిటీ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు సీతన్న, చిత్తనూర్ ప్రభాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, పి.నాగిరెడ్డి, మెహన్‌కుమార్, చంద్రకాంత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మణికొండలో..

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మణికొండ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.15 లక్షల నిధులతో సోమవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంజి నర్సింహులు, ప్రధాన కార్యదర్శి ఆకుల బస్వారాజ్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో సబ్‌ప్లాన్ కింద సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. జంగం సుధాసాగర్, ఎం.ఆంజనేయులు, జంగం గోవింద్, సానేమోని యాదయ్యగౌడ్, రామాంజనేయులు, పల్లె ఆంజనేయులు, ఎండీ రఫీక్, చిన్న పాల్గొన్నారు.

రాజునాయక్‌తండాలో

కోయిల్‌కొండ: మండలంలోని రాజునాయక్‌తండాలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకుడు రామునాయక్ ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, హనుమంతు పాల్గొన్నారు.

ముస్లింలకు పండ్లు పంపిణీ



జడ్చర్ల టౌన్: రంజాన్ మాసం పురస్కరించుకొని సోమవారం మండలంలోని మసీదుల వద్ద మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అందజేసిన పండ్లను బీఆర్ఎస్ నాయకులు ముస్లింలకు పంపిణీ చేశారు. రంజాన్ మాసం పురస్కరించుకుని 19ఏళ్లుగా ప్రతి ఏటా ముస్లింలకు పండ్లు పంపిణీ చేస్తూ వస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, నాయకులు శ్రీకాంత్, హఫీజ్, రఘుపతిరెడ్డి, ఇంతియాజ్, కిరణ్, రాంమోహన్, కరాటేశ్రీను తదితరులు పాల్గొన్నారు.